# రంకు రమా

నిత్యానందం ఓసారి జేబులోని కాగితంతీసి చూస్కుని తనకి కావలసిన అడ్రసు అదేనని నిర్ణయం చేసుకుని గేట్లోంచి లోపలికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు. ఓ ఆడమనిషి తలుపు తీసింది.

"ప్రముఖ రచయిత ప్రాణేశ్వరరావు ఇల్లు ఇదేనా ?" అడిగాడు నిత్యానందం.

"ఇదే కూర్చోండి" అంది ఆమె లోపలికి వెళ్తూ.

హాల్లో సోఫాలో కూర్చున్నాడు నిత్యానందం. రెండు నిమిషాల్లో ప్రముఖ రచయిత ప్రాణేశ్వరరావు లోపల్నుండి హాల్లోకి వచ్చాడు.

నిత్యానందం లేచి నిలబడి నమస్కారం చేసాడు.

"నమస్కారం అండీ ప్రాణేశ్వరరావుగారూ"

"నమస్కారం మీరు ?" అడిగాడు ప్రాణేశ్వరరావు.

"నా పేరు నిత్యానందం అండీ సినిమా నిర్మాతని రంకు రమా ప్రొడక్షన్స్ బ్యానర్ కింద "సిగ్గులేని యదవ" అనే సినిమా తీశాను"

"ఓహో! మీరా?! కూర్చోండి కూర్చోండి ఆ సినిమా వందరోజులు పైనే ఆడింది కదూ ?"

నిత్యానందం కూర్చున్నాడు. అతనికి ఎదురుగా ప్రాణేశ్వరరావు కూర్చున్నాడు.

"ఆ సినిమా సూపర్ హిట్ అయ్యిందండీ అది ఫామిలీ సెంటిమెంటున్న చక్కని కుటుంబగాధా చిత్రం ఈసారి మాంచి యాక్షన్ సినిమా తీద్దామని అనుకుంటున్నానండీ"

"ఓ తప్పకుండా తియ్యండి నా హెల్ప్ మీకు తప్పకుండా ఉంటుంది"

"అందుకే కదండీ మీ దగ్గరికి వచ్చింది మీ దగ్గర కథేమైనా ఉంటే ఇవ్వండి"

ఆశ్చర్యంగా అతనివంక చూసాడు ప్రాణేశ్వరరావు.

"కథా ?"

"అవునండి" బుర్రకాయ్ పైకి కిందికీ ఊపాడు నిత్యానందం.

"ఇప్పటికిప్పుడు కావాలా అదీ సిన్మాకథ ?!"

"అవునండీ"

ఫెల్లున నవ్వాడు ప్రాణేశ్వరరావు.

"సిన్మాకథలు ఎక్కడైనా రెడీగా ఉంటాయా ?" అన్నాడు చొక్కా ఎత్తి చొంగ తుడుచుకుంటూ.

"మరి మేం తీసిన సిగ్గులేని యదవ సిన్మాకథ" ఒకరైటర్ దగ్గర రెడీగా ఉంటే మేం కొన్నామే?!" బోల్డు ఆశ్చర్యపోయాడు నిత్యానందం.

"అలా రెడీగా సినిమా కథలు రాసి దగ్గర పెట్టుకున్నాడంటే అతనో థర్డ్‌క్లాస్ రైటరై ఉండుండాలి!! మాలాంటి పేరున్న రైటర్స్ అలా చెయ్యరు" గర్వంగా అన్నాడు ప్రాణేశ్వరరావు.

"కానీ ఆ సినిమా వందరోజులపైనే ఆడిందిగా ?"

"అది కథ గొప్పగా ఉందని కాదు దానికి డైలాగులు పచ్చిబూతుల పుల్లారావ్ రాశాడుగా అందుకే జనం అలా విరగబడ్డారు"

"అవునండీ మీరు చెప్పిందీ నిజమే ఇప్పుడు తీయబోయే సినిమాలో కూడా బూతులు పెడ్దామండీ" హుషారుగా అన్నాడు నిత్యానందం.

"ఒట్టి బూతులేం కర్మ పచ్చిబూతులు పెడ్దాం జులాయి వెధవలూ రౌడీ వెధవలూ కూడా పలకడానికి సిగ్గుపడే డైలాగులు పెడ్దాం" అన్నాడు ప్రాణేశ్వరరావు.

నిత్యానందం నితులెత్తి ప్రాణేశ్వరరావుకి దండంపెట్టాడు.

"ఆహా మహానుభావులు సార్ మీరు మీ లాంటి వాళ్ళుండబట్టే మాలాంటి నిర్మాతలు బతుకుతున్నారు" అనుమోదప్పు కళ్ళతో పరవశంగా అన్నాడు.

"ఇదిగో నిన్నే ఇలా వసావ్ ?" అన్నాడు ఇంట్లోకి చూస్తూ ప్రాణేశ్వరరావు.

ఇందాక తలుపు తీసినావె వచ్చింది.

"రెండు కాఫీ పట్రా"

"హూ" విసుక్కుంటూ లోపలికి వెళ్ళిందామె.

"చూశారా చూశారా ఆ విసుగు ఈ రోజుల్లో ఎంతజీతం ఇచ్చినా వినయంగాచేసే పనిమనుషులు మనకి దొరకరు"అన్నాడు నిత్యానందం.


"ఎవరి గురించీ మీరంటుంది ?" అనుమానంగా అడిగాడు ప్రాణేశ్వరరావు.

"ఇంకెవరూ ఇప్పుడొచ్చిందిగా పిచ్చి మొహం వేసుకుని వెర్రి పీనుగ !!"

"ఇలాగైతే మీకు నేను కథ రాసివ్వనంతే" కోపంగా అన్నాడు ప్రాణేశ్వరరావు.

నిత్యానందం నాలుక కొరుక్కుని చంపలేసుక్కున్నాడు.

"క్షమించండి మీకు మీ పనిమనిషి మీద అంత ప్రేముందని నాకు తెలీదు నాకూ అంతే మా పనిమనిషంటే చాలా ఇది హిహిహి"




ప్రాణేశ్వరరావు జుట్టుపీక్కుని "హబ్బా" అన్నాడు.

"ఏమండీ నేనేమైనా తప్పుమాట అన్నానా ?" నిత్యానందం భయం భయంగా అడిగాడు.

"ఆవిడ నా భార్య" గుడ్లురుముతూ అన్నాడు.

"నిత్యానందం మళ్ళీ నాలుక కొరుక్కుని చెంపలేసుకున్నాడు."

"అవున్లెండి పెళ్ళి చేసోక్కముందు పనిమనిషేగానీ పెళ్ళయితే భార్యేగా మరి హిహిహి నేనుకూడా మా పనిమనిషిని చేస్కుందామని అనుకుంటున్నా"

ప్రాణేశ్వరరావు భయంకరమైన ఆర్తనాదం చేశాడు. ఆ తరువాత జుట్టు గుప్పిళ్ళతో పీక్కున్నాడు.

"ఏంటిసార్ మళ్ళీ పొరబాట్న తప్పు మాటేం అన్లేదుకదా ?" అన్నాడు నిత్యానందం సందేహంగా చూస్తూ.

"నేనే పనిమనిషిని చేసోక్కలేదు- ఆమె మొదట్నుండీ నాభార్యే!"

నిత్యానందం గట్టిగా చెంపలేస్కుని "క్షమించండి ఇంకెప్పుడూ నాకు సంబంధంలేని విషయాల గురించి మాట్లాడను" అన్నాడు.

ఇంతలో ప్రాణేశ్వరరావు భార్య కాఫీలు పట్టుకొచ్చి టీపాయ్ మీద పెట్టి లోపలికి వెళ్ళిపోయింది.

ఇద్దరూ కాఫీలు తాగారు.

"ఊ ఇప్పుడు చెప్పండి మీ సినిమాలో హీరో ఎవరు" అడిగాడు ప్రాణేశ్వరరావు.

"ఎవర్ని హీరోగా పెట్టాలన్నది ఇంకా ఏమీ అనుకోలేదండీ" అన్నాడు నిత్యానందం.

"ఇంకా ఎవర్నీ అనుకోలేదా? మరి నా దగ్గరి కెందుకొచ్చారు ?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రాణేశ్వరరావు.

"అదేంటండీ సినిమా కథకని ముందే చెప్పానుగా ?"

"హీరో ఎవరో తెలీందే కథ ఎలా రాస్తానండీ.... మీరీ ఫీల్డుకి మరీ కొత్తలా ఉన్నారే ?"

"అవునండీ.... సిగ్గులేని యదవ నా మొదటి సిన్మానండీ." సిగ్గుతో తల వొంచుకున్నాడు నిత్యానందం!

"సిగ్గుపడింది చాల్లేగానీ ఓమారు తలెత్తి ఇలా చూసి చెప్పండి.... మీరు ఏ హీరో పెట్టుకోవాలని అనుకుంటున్నారో ఇప్పుడే నిర్ణయించి చెప్తే నేను కథ రాసిస్తాను...."

నిత్యానందం కాసేపు ఆలోచించాడు.

"ఊ.... బాగా ఆలోచించండి గుంటకళ్ళ గున్నారావో, దొడ్డి కాళ్ళ శ్యామ్రావో, గూని జానికిరామా, చెక్కమొహం చలపతా? ఎవర్ని పెట్టుకోవాలని అనుకుంటున్నారు ?"

"దొడ్డి కాళ్ళ శ్యామ్రావైతే ఈజీగా మార్కెటింగ్ అయిపోతుందండీ అతనంటే డిస్ట్రిబ్యూటర్లు ఎగబడ్తున్నారు" అన్నాడు నిత్యానందం.

"సరే అతనికి సరిపోయే కథే ఆలోచిద్దాం"

నిత్యానందం ఓసారి గదంతా కలయచూసాడు.

"మీ ఇంట్లో సొంత లైబ్రరీ లేదా ?"

"లేదు ఏం ?" అన్నాడు ప్రాణేశ్వరరావు. నిత్యానందం ఆశ్చర్యంగా నోరు తెరచాడు.

"మరి సొంత లైబ్రరీ లేకుండా సినిమాలకి కథలూ పత్రికలకి సీరియల్లూ ఎలా రాస్తున్నారు ?"

"అంటే ?"

"అంటే మరి సొంత లైబ్రరీ ఒకటి ఉండాలి కదా దాంట్లో ఇంగ్లీషు నవలలు ఉండాలి కదా వాటిని మీరు కాపీ కొట్టాలి కదా"

నిత్యానందం వేసిన జోకుకి ప్రాణేశ్వరరావు కింద పడిపోయి పొర్లి పొర్లి నవ్వాడు.

"మీరెక్కడో పాతకాలం మనుషుల్లా ఉన్నారే? ఇంగ్లీషు నవలలు చదివి కాపీకొట్టే రోజులు పోయి చాలాకాలం అయింది ఇప్పుడంతా వీడియోలే ఇంట్లో వీడియో ఉంటే బోల్డన్ని సీరియల్లు, బోల్డన్ని సినిమా కథలు ఉండండి మీకు కొన్ని టేపులు వీడియోలో వేసి చూపిస్తాను. ఇంతకీ మీ హీరో దొడ్డికాళ్ళ శ్యామ్రావే కదూ ?"

నిత్యానందం సిగ్గుతో తలవంచుకునే అవునని సమాధానంచెప్పాడు.

తరువాత ప్రాణేశ్వరరావు వీడియోలో ఒక ఇంగ్లీషు సినిమా చూపించి "ఎలా ఉంది ?" అని అడిగాడు.

"ఫైటింగ్స్ బాగున్నాయ్" అన్నాడు నిత్యానందం.

ప్రాణేశ్వరరావు మరో సినిమా కాస్త చూపించి "ఇదెలా ఉంది?" అని అడిగాడు.

"ఇందులో క్రైం సబ్జెక్టు బాగుంది" అన్నాడు నిత్యానందం.

మరో ఇంగ్లీషు సినిమా చూపించాడు.

"ఇందులో లవ్ సెంటిమెంట్స్ బాగున్నాయ్" అన్నాడు నిత్యానందం

"ఆ ఇప్పుడు మనం ఏం చేస్తామంటే మొదటి సినిమాలోని ఫైటింగులూ, రెండో సినిమాలోని క్రైం ఎలిమెంటూ మూడో సినిమా లోని లవ్, సెంటిమెంట్సూ తీసుకుని కొత్తకథ తయారు చేసుకుంటా మన్న మాట!"

"అర్రెర్రె భలే గమ్మత్తుగా ఉందే!!" ఆశ్చర్యపోయాడు నిత్యానందం.

"మరేమనుకున్నారూ? ఇప్పుడు మద్రాసులో రైటర్లందరూ ఇదే పనిచేస్తున్నారు!!" ఉత్సాహంగా చెప్పాడు ప్రాణేశ్వరరావు.

నిత్యానందం కాస్సేపు ఆశ్చర్యపోయి తరువాత "మరి కథ రాసి నందుకు మీకేం ఇవ్వాలి?" అని అడిగాడు.

"కథకి ఇరవై అయిదువేలు బాతు డైలాగులకి మరో ఇరవై అయిదువేలు" చెప్పాడు ప్రాణేశ్వరరావు.

"సరేనని చెప్పి ఇంటికెళ్ళిపోయాడు నిత్యానందం. కానీ ఇంటికి వెళ్ళిన తరువాత నిత్యానందకి. అనిపించింది వీడియో టేపులు చూసి ఆ మాత్రం కథ నేనే తయారు చేస్కోలేనా? అని అనవసరంగా రచయితకి అన్ని వేలెందుకు తగలెయ్యాలి అనుకున్నాడు

అలా అనుకున్నదే తడవుగా తనే ఇంట్లో కొన్ని వీడియో టేపులు చూసి స్వంతంగా కథ తయారు చేసుకుని దానికి లేబర్ కాలనీకి వెళ్ళి వాళ్ళు దెబ్బలాడేప్పుడు వాడే మాటలన్నీ డైలాగులుగా రాసి "దొంగ నాకొడుకు" అనే సినిమా తీశాడు (మరి ఇప్పుడొచ్చే సినిమా పేర్లన్నీ అలానే ఉంటున్నాయ్) ఆ సినిమా సూపర్ హిట్ అయ్యింది. దానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ చిత్రం అవార్డు కూడా వచ్చింది.